కేవలము ఆముష్మికమునకై ఐహికమును వారు గోల్పోయిరి. కేవలము ఐహికమునకై ఆముష్మికమును వీరు గోల్పోవుచున్నారు. వారికి రాజు దైవస్వరూపుడు. వీరికి దానవస్వరూపుడు. వారికి ప్రభుత్వ నీతినియమములపై ఎక్కువ ప్రీతి. వీరికి ఎక్కువ భీతి. రాజశాసనములు వారిని సక్రమమార్గమున నడిపించినవి. వీరిని విప్లవమార్గములు త్రొక్కించినవి. వినయము ఆనాడు పేరుదెచ్చినది. విప్లవము ఈనాడు కీర్తిని దెచ్చుచున్నది. విన్నపముల మూలముననే ఆ కాలపు ప్రజలు తమకోర్కెలు నెరవేర్చుకొనగలిగిరి. విప్లవముల మూలముననే ఈ కాలపుమనుష్యులు తమఆశయముల నెరవేర్చుకొనుచున్నారు.

విన్నపములకు రోజులవి. విప్లవములకు దినములివి. అప్పటిజీవితము నవరసభరితమైనది. ఇప్పటిజీవితము అష్టకష్టమయమైనది. శక్తిపై నాధారపడి జయముపొందుట ఆనాటిధర్మము. యుక్తిపై నాధారపడి విజయముగొనుట ఈనాటిమర్మము. పూర్వకాలపు మతములు నమస్కారమయములు. నవీనకాలపుమతములు తిరస్కారమయములు. విషయమెంత దురవగ్రాహ్యమైన అప్పటివారికి భక్తి అంత ఎక్కువ. ఇప్పటివారికి విరక్తి అంతఎక్కువ.

కులధర్మములు వారికిముఖ్యము. పార్టీధర్మములు వీరికిముఖ్యము. కులధర్మము నుల్లంఘించినవారికి ఆ కాలమందు ప్రత్యక్షముగశిక్షించి పరోక్షమున బుద్ధిగరపిరి. పార్టీధర్మముల నుల్లంఘించినవారిని ఈకాలమందు పరోక్షమున దిట్టుచు ప్రత్యక్షముగ పొగడుచున్నారు. మతములనుండి ఆనాడుశాసనములు వెలువడినవి. మందిరములనుండి ఈనాడు శాసనములు వెలువడుచున్నవి. పుట్టు ప్రతిశాసనము తమయొక్క ప్రతిభాభివృద్ధికేయని అప్పటివారి తలంపు. చేయు ప్రతిశాసనము తమయొక్క స్వేచ్ఛ నరికట్టుటకేయని ఇప్పటివారి కసరింపు. తమ పూర్వులు తమకంటె గొప్పవారని ఆ కాలపుమనుష్యులు నిరతమునమ్మిరి. తమ పూర్వులు తమకంటె ఛాందసులని ఈ కాలపువారు సతతము సణుగుచుందురు. సనాతనమైన ప్రతివిషయముపై వారికి ఆసక్తిమెండు. నవీనమైన విషయములన్నిటిపై వీరికి వ్యామోహమునిండు. నూతనముకు వారు ఏవగించుకొనిరి. సనాతనమునకు వీరు స్వస్తిజెప్పిరి. పశ్చిమదేశస్థులు వారికి మ్లేచ్ఛులు. వీరికి ఆదర్శప్రాయములు. విదేశ ఆచారవ్యవహారములను వారు ఏవగించుకొనిరి. వీరు ఆలింగనము చేసికొనిరి. భోగముల నాశించి త్యాగములను చేసిన కార్యశూరులు వారు. త్యాగములు చేయుమనుమని భోగముల నార్జించిన వాక్శూరులు వీరు. అన్నివిధముల వారు అతీతులు. పలువిధముల వీరు పతితులు.

అప్పటి స్త్రీధర్మము వేరు. ఇప్పటి స్త్రీధర్మము వేరు. ఆమె అబల. ఈమె సబల. సతతము సహధర్మ మాచరించుట ఆమె వృత్తి. నిరతము పోటీపడుట ఈమె ప్రవృత్తి.

ఆమెముగ్ధ. ఈమెప్రౌఢ. ఆనాటిముగ్ధలకు పసుపురాసుకొనుటయందు ప్రీతి. ఈనాటి ప్రౌఢలకు పౌడరు రాసుకొనుటయందు ప్రీతి. పెండ్లియందు ప్రేమించుట తరువాత ఆనాటి వారికి ధర్మము. ప్రేమయందు పెండ్లియాడుట తరువాత ఈనాటివారికి ధర్మము. రాణివాసము ఆకాలపు స్త్రీలకు కష్టముగా కాన్పించలేదు. స్వేచ్ఛావిలాసము ఈకాలపు స్త్రీలకు నింద్యముగా కాన్పించుటలేదు. అబలయగుటచే అన్ని విషయములందు పతిపై నాధారపడవలసి వచ్చినది ఆనాటి కాంత. సబలయగుటచే ఏవిషయమునందును భర్తపై నాధారపడుటలేదు ఈనాటి సుదతి. రావణుని నిజరూపమును చూడగనే భయవిహ్వలయై మూర్ఛనొందినది ఆ కాలపుసీత. రావణ స్వరూపమును చూచుటతోడనే బట్ట బిగియగట్టి చేతులు సవరించి నీవా నేనాయని కలయబడుటకు వెనుదీయదు ఈ కాలపుసీత. భర్తతో అరణ్యమునకు పోయినది అప్పటి దమయంతి. పతితోక్లబ్బులకు పోవుచున్నది ఇప్పటి దమయంతి. ధవునికి సతతము ధర్మోపదేశముచేయుట ఆకాలపు చంద్రమతి ధర్మము. ప్రియునికి నిరతము "టీ"గాచి యిచ్చుట ఈకాలపు చంద్రమతి కర్మము.

అత్త ఆనాడు పెత్తనము వహించినది. కోడలు ఈనాడు ప్రభుత్వము చేయుచున్నది. ఆనాటి అత్త కోడలకు రాక్షసియై గాన్పించినది. ఈనాటికోడలు అత్తకు కొరవి దయ్యమై గాన్పించుచున్నది. ఆకాలమందు అత్త తనకోడలిచే దాసీతనము చేయించుకొన్నది. ఈకాలమందు కోడలు తనఅత్తచే ఊడిగము చేయించుకొనుచున్నది. ఆనాటి కుటుంబసామ్రాజ్యమునందు అత్తయొక్క నిరంకుశత్వమునకు కొదువలేదు. ఈనాటి కుటుంబసామ్రాజ్యమునందు కోడలి విప్లవమునకు అంతులేదు. అత్తశెలవిచ్చిననే తప్ప కోడలు కొడుకుతో మాట్లాడుటకు వీలులేని రోజులవి. కోడలు దయతలచిననే తప్ప కొడుకు తల్లితో మాట్లాడుటకు వీలులేని దినము లివి.

అత్తచే ఆనాటికోడలు చీపురుదెబ్బలు తిన్నది. కోడలిచే ఈనాటి యత్త మొట్టికాయలు తినుచున్నది. అత్తల గూడుపుఠాణీలు ఆకాలమునందు మహా ఎక్కువగా నుండెడివి. కోడండ్ర కాన్ఫరెన్సులు ఈ కాలమున మరీ మిక్కుటముగనున్నవి. అత్తల రోజులవి. కోడండ్ర దినములివి. అప్పటి కోడండ్రకు అత్త ఒక గృహదేవత. ఇప్పటి కోడండ్రకు అత్త ఒక గ్రహదేవత.

అప్పటి బిడ్డ ప్రకృతివేరు. ఇప్పటి బిడ్డల యావేశములు వేరు. పవిత్రపు మాతృస్తన్యమును త్రాగి పెరిగిన ఆనాటిబిడ్డలకు మాతృభక్తి యెక్కువ. కృత్రిమపు డబ్బాపాలు త్రాగి పెరిగిన ఈనాటిబిడ్డల కదిశూన్యము. సంతానవతియగు సతిని ఆనాటిపతి సత్కరించినాడు. బర్త్ కంట్రోలు నాచరించు భార్యను ఈనాటిభర్త బహూకరించుచున్నాడు.